పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్య

- వచ్చే విద్యా సంవత్సరానికి నోటిఫికేషన్ విడుదల
- ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం సీట్లు కేటాయింపు
- ఒకటో తరగతిలో ఉచిత ప్రవేశాలకు రిజిస్ట్రేషన్ల ఆహ్వానం
- మార్చి 14వ తేదీన దరఖాస్తుకు తుది గడువు


తరగతిలో పాఠం వింటున్న విద్యార్థులు

ఆలూరు రూరల్: విద్యా హక్కు చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం పక్కాగా అమలు చేసేందుకు చర్యలు చేపట్టింది. విద్యా సంవత్సరం ప్రారంభంలో నోటిఫికేషన్ విడుదల చేసింది. వచ్చే విద్యా సంవత్సరానికి ప్రస్తుత విద్యా సంవత్సరంలోనే నోటిఫికేషన్ విడుదల చేయడం ప్రభుత్వ చిత్తశుద్ధిని తెలియజేస్తోంది. విద్యా హక్కు చట్టాన్ని అనుసరించి ప్రైవేటు పాఠశాలల్లో విద్యనందించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ప్రభుత్వ నిర్ణయం పేద విద్యార్థులకు వరంగా మారనుంది. విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం సీట్లు పేద విద్యార్థులకు ఉచితంగా ఇవ్వాల్సి ఉంటుంది. ప్రైవేటు పాఠశాలలు ఈ మేరకు వారికి ఒకటో తరగతిలో ప్రవేశాలు కల్పించాల్సి ఉంది. పాఠశాలల్లో ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులైన విద్యార్థుల జాబితా విద్యాశాఖ విడుదల చేసింది. ఎంపికైన విద్యార్థులకు ప్రైవేటు పాఠశాలలు ప్రవేశాలు కల్పించాల్సి ఉంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, హెచ్ఐవీ బాధితుల పిల్లలు అర్హులు ఈ పథకానికి అర్హులు. ఉచిత ప్రవేశాలకు నిరాకరించిన యాజమాన్యాలపై విద్యాశాఖ చర్యలు తీసుకోనుంది.

పక్కాగా అమలు

గత టీడీపీ ప్రభుత్వం విద్యాహక్కు చట్టాన్ని నిర్వీర్యం చేసింది. నిబంధనల ప్రకారం ప్రైవేటు పాఠశాలల్లో పేద విద్యార్థులకు 25 శాతం సీట్లు ఉచితంగా కేటాయించాల్సి ఉండగా ఎక్కడా అమలుకు నోచుకోలేదు. వైఎస్సార్‌సీపీ అధికారం చేపట్టిన తర్వాత ప్రైవేటు పాఠశాలల్లో పేద విద్యార్థులకు ఒకటో తరగతి నుంచి ఉచిత విద్యనందించేందుకు 2022-23 విద్యా సంవత్సరంలోనే శ్రీకారం చుట్టింది. నిబంధనల ప్రకారం అర్హత ఉన్న వారిని ప్రభుత్వమే ఎంపిక చేస్తోంది. 2023-24 ఏడాది ప్రైవేటు పాఠశాలల్లో విద్యాభ్యాసానికి అర్హులైన వారిని ఎంపిక చేసి ప్రవేశాలు కల్పించారు. ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొంటున్న వర్గాలకు విద్యాహక్కు చట్టం ప్రకారం 25 శాతం సీట్లు కేటాయించారు. స్వీకరించిన దరఖాస్తుల్లో రిజర్వేషన్లు, నిబంధనల మేరకు అభ్యర్థులను ఎంపిక చేసి సీట్లు కేటాయించారు. విద్యార్థుల తల్లిదండ్రులు, సంరక్షకులకు సమాచారం ఇచ్చి ప్రవేశాల ప్రక్రియ పూర్తి చేశారు.

2024-25 విద్యా సంవత్సరానికి దరఖాస్తుల స్వీకరణ

విద్యా హక్కు చట్టం-2009 ప్రకారం ఏటా ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం సీట్లు పేద విద్యార్థులకు కేటాయించాలని ఉన్నా గత ప్రభుత్వాలు పట్టించుకోలేదన్న విమర్శలున్నాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విద్యకు అధిక ప్రాధాన్యమిస్తున్న నేపథ్యంలో ప్రైవేటు, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో పేదలకు 25 శాతం సీట్లు ఇచ్చే అంశాన్ని సీరియస్‌గా తీసుకున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇకపై ఏటా అర్హులైన పేద విద్యార్థులు ప్రైవేటు పాఠశాలల్లో ఒకటో తరగతిలో అడ్మిషన్ పొంది చదువుకునే అవకాశం కల్పించేలా ఇప్పటినుంచే చర్యలు తీసుకున్నారు. ఈ మేరకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు విద్యాశాఖ అధికారులు వెల్లడించారు. సీబీఎస్ఈ, స్టేట్ సిలబస్ అమలవుతున్న ప్రైవేటు పాఠశాల్లో 25 శాతం సీట్లు ఒకటో తరగతి విద్యార్థులకు కేటాయించాల్సి ఉంది.

షెడ్యూల్ ఇలా..

→ అభ్యర్థులు htt p://cse.ap.gov.in పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.
→ ఈ నెల 23 నుంచి మార్చి 14 వరకు విద్యార్థుల వివరాల నమోదుకు అవకాశం కల్పించారు.
→ మార్చి 20 నుంచి 22 వరకు విద్యార్థుల దరఖాస్తు అర్హతపై చెక్ చేసుకోవచ్చు.
→ ఏప్రిల్ 1న లాటరీ పద్ధతి ద్వారా మొదటి విడత జాబితా విడుదల చేస్తారు
→ ఏప్రిల్ 2 నుంచి 10వ తేదీ వరకు ఆయా పాఠశాలల్లో ఎంపికైన విద్యార్థులకు అడ్మిషన్ ప్రక్రియ జరుగుతుంది.
→ ఏప్రిల్ 15న లాటరీ పద్ధతి ద్వారా రెండవ జాబితా విడుదల
→ ఏప్రిల్ 16 నుంచి 23 వరకు ఆయా పాఠశాలల్లో ఎంపికై న విద్యార్థుల అడ్మిషన్ ప్రక్రియ కొనసాగుతుంది.

పేద విద్యార్థులకు వరం



విద్యా హక్కు చట్టం ప్రకారం పేద విద్యార్థులకు ప్రైవేటు పాఠశాలల్లో ఒకటో తరగతిలో ప్రవేశానికి ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఇది పేద విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న ఒక వరం. ప్రైవేటు పాఠశాలల్లో ఒకటో తరగతి ప్రవేశానికి విడుదలైన నోటిఫికేషన్ ప్రకారం అర్హులైన తల్లిదండ్రులు దరఖాస్తు చేసుకోవాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, హెచ్ఐవీ బాధితుల పిల్లలు అర్హులు. **– కోమలాదేవి, ఎంఈఓ, ఆలూరు.**

పోటెత్తిన అభిమానం

కృష్ణగిరి: రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో 175 సీట్లకు 175 స్థానాల్లో గెలుపొందేలా పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేసేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదివారం అనంతపురం జిల్లా రాప్తాడు సిద్ధంకు సభకు వస్తున్న సందర్భంగా మండలం నుంచి భారీగా పార్టీ శ్రేణులు తరలివెళ్లారు. ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి, జెడ్పీటీసీ కేతఃసుభాషిణి ఆధ్వర్యంలో 21 బస్సులు, పలు వాహనాలతో సభా ప్రాంగణానికి చేరుకున్నారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం వైఎస్ జగనన్నతోనే సాధ్యమని వారు స్పష్టం చేశారు.

వెల్దుర్తి(కృష్ణగిరి): రాప్తాడు 'సిద్ధం' సభకు వెల్దుర్తి మండలం నుంచి 30కు పైగా బస్సులు, కార్లు, జీపులలో మండల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. రాబోవు రోజుల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేస్తామంటూ, జై జగన్ అంటూ నినదిస్తూ ముందుకు కదిలారు.

తుగ్గలి: 'సిద్ధం' బహిరంగ సభకు తుగ్గలి మండలం నుంచి పెద్ద ఎత్తున వైఎస్సార్‌సీపీ శ్రేణులు తరలివెళ్లాయి. ఆయా గ్రామాల నాయకుల పర్యవేక్షణలో బస్సులు, కార్లు, జీపుల్లో కార్యకర్తలు, అభిమానులు సభకు వెళ్లారు.

మద్దికెర: మండలం నుంచి పంచాయతీ సలహాదారు ఆంజనేయులు, ఐడీసీ సభ్యుడు వెంకటేశ్వర్లు, వైఎస్సార్సీపీ జిల్లా కార్యదర్శి మల్లికార్జున, శ్రీనివాసులు ఆధ్వర్యంలో 15 బస్సుల్లో కార్యకర్తలు, అభిమానులు సిద్ధం సభకు తరలివెళ్లారు.

ఆస్పరి: మండలంలోని ఆస్పరి, శంకరబండ, హలిగేర, చిగిళి, బిణిగేరి, నగరూరు, తదితర గ్రామాల నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు సిద్ధం సభకు వాహనాలలో తరలివెళ్లారు.

హొళగుంద: రాప్తాడులో ఆదివారం జరిగిన సిద్ధం కార్యక్రమానికి హొళగుంద, ఎల్లార్తి గజ్జహళ్లి, నెరణికి తదితర గ్రామాల నుంచి నాయకులు, కార్యకర్తలు బస్సులు, ఇతర వాహనాల్లో తరలివెళ్లారు. ఎల్లార్తి సర్పంచ్ కురువ చాముండేశ్వరి, నాయకులు ఉన్నారు.


ఎమ్మిగనూరు నుంచి బయలుదేరుతున్న మున్సిపల్ కౌన్సిలర్లు

హాలహర్వి: మండలం నుంచి అనంతపురం రాప్తాడులో జరిగే 'సిద్ధం' సభకు భారీగా వైసీపీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. మండల కన్వీనర్ రామారెడ్డి, కో-కన్వీనర్ జనార్ధన్‌నాయుడు, ఎంపీటీసీలు తదితరులు ఉన్నారు.

దేవనకొండ: మండలం నుంచి రాప్తాడులో జరిగే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి 'సిద్ధం' మహాసభకు పెద్ద ఎత్తున పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. 17 బస్సుల్లో 1000 మందికిపైగా తరలివెళ్లారు.

ఎమ్మిగనూరుటౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారధ్యంలో అనంతపురం జిల్లా రాప్తాడులో సిద్ధం సభకు పట్టణం నుంచి మున్సిపల్, కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జ్‌లు, పార్టీ శ్రేణులు ఆదివారం బస్సుల్లో తరలివెళ్లారు. ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్త బుట్టారేణుకల ఆధ్వర్యంలో నియోజకవర్గం నుండి దాదాపు 50 బస్సుల్లో పార్టీ శ్రేణులు తరలివెళ్లారు.

నందవరం: మండలంలోని అన్ని గ్రామాల నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు రాప్తాడు సిద్ధం సభకు తరలివెళ్లారు. 8 బస్సులు, 4 జీపుల్లో రాప్తాడుకు వెళ్లారు.


జొహరాపురం నుంచి బయలుదేరిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు

టీడీపీ నేతలకు నైతిక విలువలు లేవు

ఆలూరు: అట్టడుగు వర్గాలకు చెందిన పేదలకు అండగా నిలిచి సంక్షేమ పథకాలను అందిస్తున్న జగనన్న ప్రభుత్వానికి రానున్న ఎన్నికల్లో అండగా నిలవాలని వైఎస్సార్‌సీపీ ఆలూరు నియోజకవర్గ సమన్వయకర్త బుసినె విరూపాక్షి ప్రజలకు పిలుపునిచ్చారు. అనంతపురం జిల్లా రాప్తాడులో ఆదివారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించిన 'సిద్ధం' బహిరంగ సభకు తరలివెళ్లే కార్యకర్తల బస్సులను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. అంతకుముందు ఆయన మాట్లాడుతూ.. టీడీపీ నేతలకు నైతిక విలువలు లేవని, అధికారం కోసం ఎంతకైనా దిగజారుతారని ఎద్దేవా చేశారు. మోసపూరిత హామీలు ఇచ్చే టీడీపీ, జనసేనను నమ్మవద్దని ప్రజలకు సూచించారు. నియోజకవర్గం నుంచి దాదాపు 80 బస్సులు, 150 వాహనాలలో కార్యకర్తలు, నాయకులు, ప్రజాప్రతినిధులు సిద్ధం సభకు తరలివెళ్లారు. జిల్లా పరిషత్ వైస్ చైర్‌పర్సన్ బొజ్జమ్మ, నాయకులు జనార్ధన్‌నాయుడు, హేమలత, మల్లికార్జున, మారయ్య తదితరులు ఉన్నారు.


జెండా ఊపి బస్సును ప్రారంభిస్తున్న విరూపాక్షి


తుగ్గలి నుంచి బయలుదేరిన నాయకులు


మద్దికెర నుంచి తరలివెళుతున్న నాయకులు


ఆస్పరిలో..


హొళగుంద నుంచి తరలివెళుతున్న కార్యకర్తలు


దేవనకొండలో..


వెల్దుర్తి నుంచి తరలివెళ్తున్న నాయకులు, కార్యకర్తలు


ఆలంకొండ నుంచి రాప్తాడు సభకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్న పార్టీ శ్రేణులు


హాలహర్విలో..

దేవరగట్టులో ప్రత్యేక పూజలు


మాళ మల్లేశ్వరస్వామికి పూజలు నిర్వహిస్తున్న పూజారులు

హొళగుంద: దసరా ఉత్సవాలకు జిల్లాలో ప్రత్యేకత సంతరించుకున్న దేవరగట్టులో ఆదివారం స్వామివారాన్ని పురస్కరించుకుని మాళ మల్లేశ్వర స్వామికి భక్తిశ్రద్ధలతో పూజలు జరిగాయి. ఆలయ పూజారులు స్వామివారికి సుప్రభాత సేవ, అభిషేకాలు, బండరార్చన, కుంకుమార్చన, పుష్పార్చన, మహామంగళారతి, ఆకుపూజ, నివేదన, నీరాజన తదితర పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు. ఈ సందర్భంగా స్వామి విరాట్ మూర్తులకు పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్థానికులే గాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు స్థానిక ఆస్పరి మఠంలో అన్నదానం చేశారు.

సిద్ధేశ్వర స్వామికి పూజలు

హొళగుంద: మండల కేంద్రం హొళగుందలో వెలిసిన సిద్ధేశ్వరస్వామి జాతర ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. రథోత్సవంలో భాగంగా ఉదయం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆలయంలో మొక్కులు తీర్చుకున్నారు. గ్రామస్తులు బంధువులు, స్నేహితులతో కలిసి ఉత్సవాన్ని సంబరంగా జరుపుకున్నారు. ఆలయంలో స్వామి వారికి జలాభిషేకం, ఆకుపూజ, రుద్రాభిషేకం తదితర పూజలు జరిగాయి. నైవేద్యం సమర్పించిన భక్తులు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కేంద్రంలో భోజనాలు చేశారు. ఆలయ ధర్మకర్తలు రాజపంపన్నగౌడ్, శివన్నగౌడ్ , సిద్ధార్థగౌడ్ ఆధ్వర్యంలో ఉత్సవ కార్యక్రమాలు జరిగాయి.

శరవేగంగా రోడ్డు నిర్మాణం

హొళగుంద: కర్ణాటక సరిహద్దు ఆనుకుని ఉన్న మార్లమడికి పంచాయతీరాజ్ రోడ్డులో కొత్త రహదారి ఏర్పాటుకు కాంట్రాక్టర్ పనులను వేగవంతం చేశాడు. ఈ నెల 14న మంత్రి గుమ్మనూరు జయరాం, వైఎస్సార్‌సీపీ ఆలూరు నియోజకవర్గ సమన్వయకర్త విరూపాక్షి మార్లమడికి డబుల్ రోడ్డు పనులకు భూమిపూజ చేసి ప్రారంభించిన సంగతి తెలిసిందే. అందులో భాగంగా కాంట్రాక్టర్ స్థానిక దిగువ కాలువ నుంచి గ్రావెల్‌ను కుప్పలుగా నిల్వ చేసి పనులు చేపట్టారు. హొళగుంద-మార్లమడికి రోడ్డు మొత్తం 5.10 కి.మీలకు గాను రూ.5.40 కోట్లతో పనులు చేపట్టారు. స్థానిక వాల్మీకి సర్కిల్ నుంచి ఎల్లెల్సీ బ్రిడ్జ్ దాటి కొద్ది దూరం వరకు (400 మీటర్లు) డబుల్ సీసీ రోడ్డు అక్కడి నుంచి మార్లమడికి వరకు దాదాపు 4 కి.మీ డబుల్ తారు రోడ్డు వేయనున్నారు. పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేస్తామని కాంట్రాక్టర్ రఘు తెలిపారు. మార్లమడికి రోడ్డు బాగైతే బళ్లారి, శిరుగుప్ప, హొస్పేట్, సింధనూరు, గంగావతి తదితర ప్రాంతాలకు వెళ్లేందుకు, ఇటువైపు వచ్చేందుకు ఇరు ప్రాంత ప్రజల దశబ్దాల కాలం నాటి కల నెరవేరుతుంది.

కోలుకోలేక వ్యక్తి మృతి

ఓర్వకల్లు: పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ..కోలుకోలేక శనివారం రాత్రి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు ఇలా.. ఓర్వకల్లు గ్రామంలోని శ్రీచెన్నకేశవస్వామి దేవాలయం వద్ద నివాసముంటున్న తంబలి దానయ్య కుమారుడు తంబలి నాగేశ్వరయ్య(50) పంట దిగుబడులు సరిగా రాకపోవడం, వ్యవసాయం కోసం తెచ్చిన అప్పులు తీర్చలేక పోవడం, 9 నెలల క్రితమే భార్య జయంతి అనారోగ్యంతో మృతి చెందడంతో తీవ్ర మనస్తాపానికి లోనయ్యాడు. ఈ క్రమంలో ఈ నెల 16వ తేదీన పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా, గమనించిన కుటుంబ సభ్యులు చికిత్సకోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్సపొందుతూ.. కోలుకోలేక ఆదివారం మృతి చెందాడు. మృతుని కుమార్తె భవాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ రాజారెడ్డి తెలిపారు.

క్లుప్తంగా

నేడు కృష్ణగిరిలో వలంటీర్లకు సన్మానం

కృష్ణగిరి: స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో సోమవారం వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించి సేవా పురస్కారాలను ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి, జెడ్పీటీసీ కేతఃసుభాషిణి చేతుల మీదుగా అందించనున్నట్లు సూపరింటెండెంట్ రామస్వామి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని 14 గ్రామ సచివాలయ పరిధిలోని వలంటీర్లు ఈ కార్యక్రమానికి హాజరుకావాలన్నారు. 191 మంది వలంటీర్లకు సేవా మిత్ర, ఐదుగురికి సేవా రత్న పథకాలు ఎమ్మెల్యే చేతుల మీదుగా అందిస్తామన్నారు. మండలస్థాయి అధికారులందరూ హాజరుకావాలని కోరారు.

భగవద్గీతపై ఇంటింటి ప్రచారం


నందవరంలో భగవద్గీత ప్రచారం నిర్వహిస్తున్న ప్రబోధ సేవ సమితి సభ్యులు

నందవరం: మండల కేంద్రంలో ఆదివారం ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక సభ్యులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మాఘ మాసంలో సద్గుణ, నిర్గుణ పూజ విశిష్టత తెలుసుకోవాలని వివరించారు. భగవద్గీత చదవడం వల్ల ధర్మ మార్గం అనుసరిస్తూ భగవంతుని పట్ల భక్తిభావం పెరిగి సేవా గుణం అలవర్చుకుంటారని తెలిపారు. మనిషి జీవన శైలిలో మార్పులు, దైవ సముపార్జన పొందుతారని పేర్కొన్నారు. ఇందు జ్ఞాన వేదిక సభ్యులు నరేష్, భాస్కర్, వీరన్నగౌడ్, లక్ష్మీకళ, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

చిరువ్యాపారులను ఆదుకోవాలి

పత్తికొండటౌన్: చిరువ్యాపారులను ఆదుకునేందుకు పూచీకత్తు లేని బ్యాంకు రుణాలను మంజూరు చేయాలని ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ కార్యదర్శి ఎస్.కృష్ణయ్య విజ్ఞప్తి చేశారు. ఆదివారం పత్తికొండ పట్టణంలోని చదువుల రామయ్య భవన్‌లో చిరువ్యాపారుల సంఘం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ.. రోడ్డు సైడు తోపుడుబండ్లపై వ్యాపారాలు చేసుకునే చిరు వ్యాపారులను ప్రోత్సహించేందుకు వారికి మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. పూచీకత్తు లేని బ్యాంకు రుణాలు ఇవ్వాలన్నారు. ఇళ్లు లేని పేదలకు పక్కాగృహాలు మంజూరు చేయాలని కోరారు. ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు నెట్టికంటయ్య, పార్టీ నాయకులు మాదన్న, రాజప్ప, చిన్నవ్యాపారుల సంఘం అధ్యక్షుడు ఈరన్న, నాయకులు శ్రీనివాసులు, లక్ష్మి, భాస్కర్, ఓబులేసు పాల్గొన్నారు.

టెంకాయల విక్రయ హక్కుల వేలం


ములుగుందంలో వేలంపాట నిర్వహిస్తున్న దృశ్యం

ఆస్పరి: మండలంలోని ములుగుందంలో వెలసిన దస్తగిరి స్వామి ఉరుసు సందర్భంగా టెంకాయల విక్రయ హక్కుల వేలం రూ.2 లక్షలు పలికింది. ఆదివారం ములుగుందం దస్తగిరి స్వామి దర్గాలో గ్రామస్తుల సమక్షంలో వేలంపాట నిర్వహించగా ఆరుగురు పాటదారులు పాల్గొన్నారు. చివరకు గుంజుపల్లి సాధిక్ రూ.2 లక్షలకు పాడి హక్కులను దక్కించుకున్నారు. గతేడాది వేలంపాట రూ.2.27 లక్షలు పలకగా, ఈసారి రూ.2 లక్షలకే పరిమితమైంది. గ్రామ పెద్దలు వెంకటరెడ్డి, నరిసిరెడ్డి, మల్లికార్జున రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలు

దేవనకొండ: మండలంలోని కప్పట్రాళ్ల గ్రామంలోని రిజర్వ్ ఫారెస్టులో కొలువైన కొలుట్ల చెన్నకేశవ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 19వ తేదీ నుంచి 25వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి చంద్రశేకర్‌రెడ్డి, ధర్మకర్త హనుమంతరెడ్డి ఆదివారం తెలిపారు. ఆదివారం వారు మాట్లాడుతూ.. ఉత్సవాల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. ఈ నెల 19న స్వామివారికి పర్వతారోహణం, 20న ధ్వజారోహణం, అంకురార్పణ, 21న స్వామివారి కళ్యాణోత్సవం, 22న కలశ స్థాపన, రథాంగ హోమం, 24న స్వామివారి రథోత్సవం, 25న వసంతోత్సవం, చక్రస్నానంతో ఉత్సవాలు ముగుస్తాయని చెప్పారు. రథోత్సవం రోజు కరిడికొండ కరణం హనుమంతప్ప, పార్వతమ్మ జ్ఞాపకార్థం వారి కుమారులు భక్తులకు అన్నదానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్వామివారి సన్నిధిలో భక్తుల సౌకర్యార్థం దాతలు తాగునీటి వసతి కల్పించేందుకు ముందుకు రావాలని కోరారు.

తాగునీటి బోరు ఏర్పాటు

తుగ్గలి: మండల పరిధిలోని కొత్తపల్లి గుడిసెలలో ఆర్డీటీ ఆధ్వర్యంలో తాగునీటి బోరు తవ్వకం చేశారు. బోరులో దాదాపు మూడు ఇంచుల నీరు పడినట్లు గ్రామస్తులు తెలిపారు. బోరు తవ్వకం పట్ల గ్రామస్తులు ఆర్డీటీకి కృతజ్ఞతలు తెలియజేశారు.


రూ.2.29 కోట్లతో నిర్మించిన తారురోడ్డు


రూ.20.80 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్

ప్రారంభానికి సిద్ధం

మద్దికెర: మండల కేంద్రం నుంచి బొజ్జనాయునిపేట గ్రామానికి రూ.2.29 కోట్లతో నిర్మించిన తారురోడ్డు, అలాగే రూ.20.80 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాన్ని ఈ నెల 20వ తేదీన ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు ఇరిగేషన్ శాఖ రాష్ట్ర డైరెక్టర్ ఆర్.వెంకటేశ్వర్లు ఆదివారం తెలిపారు. ఎన్నో ఏళ్లుగా రోడ్డు సౌకర్యం లేక గ్రామ ప్రజలు ఇబ్బందులు పడ్డారని, సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే నిధులు మంజూరు చేయించారన్నారు. నిధులతో రోడ్డు నిర్మాణం పూర్తిచేయడంతో బొజ్జనాయునిపేట గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు.

25న వృషభాల బండలాగుడు పోటీలు

మద్దికెర: మండల కేంద్రంలో మద్దమాంబ జాతర పురస్కరించుకొని ఈనెల 25వ తేదీన జిల్లా పరిషత్ బాలుర పాఠశాల మైదానంలో రాష్ట్రస్థాయి న్యూ కేటగిరీ ఒంగోలుజాతి ఎద్దుల రాతిదూలం లాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఆదివారం తెలిపారు. విజేత వృషభాల యజమానులకు ఎంపీపీ డీఎస్ అనితాయాదవ్, వైఎస్సార్సీపీ నాయకులు శ్రీనివాసులు బ్రదర్స్ మొదటి బహుమతి రూ.60,116, కోడుమూరు కేశవులు, గొడుగువేణు రెండవ బహుమతి రూ.40 వేలు, మైత్రి స్కూల్ ఆనంద్‌రావు మూడవ బహుమతి రూ.30 వేలు, శ్రీకృష్ణయూత్ నాల్గవ బహుమతి రూ.20 వేలు, కవిరెడ్డి రామాంజనేయులు ఐదవ బహుమతి రూ.10,116, ఆకుల ఖాజావలి ఆరవ బహుమతి రూ.5116 అందించనున్నట్లు చెప్పారు. పోటీల రోజున కిట్టి, నాగేష్, శ్రీరాములు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఆసక్తిగల వారు 25వ తేదీ ఉదయం 7:30 గంటల్లోపు పేరు నమోదు చేయించుకోవాలని, వివరాలకు 98494 09827 ఫోన్ నంబర్‌కు సంప్రదించాలన్నారు.

25న చిట్యాలలో..

కృష్ణగిరి: మండల పరిధిలోని చిట్యాల గ్రామంలో లాలూస్వామి ఉరుసు సందర్భంగా ఈ నెల 25న రాష్ట్రస్థాయి పాలపళ్ల ఎద్దుల బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే వారు రూ.500 ఎంట్రీఫీజు చెల్లించి పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. గెలుపొందిన వృషభాల యజమానులకు వరుసగా రూ.60 వేలు, రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేల నగదు బహుమతులు అందించనున్నట్లు చెప్పారు. పేర్ల నమోదుకు 77026 30416, 99890 28249 ఫోన్ నంబర్లను సంప్రదించాలన్నారు.

వైభవంగా పెద్దమ్మవ్వ ఆలయ ప్రారంభోత్సవం

ఆదోనిరూరల్: మండలంలోని చిన్నపెండేకల్ గ్రామంలో పెద్దమ్మవ్వ నూతన ఆలయ ప్రారంభ వేడుకలు ఆదివారం వైభవంగా జరిగాయి. గ్రామ పెద్దలు, శ్రీశైల దేవస్థాన ఆస్థాన సిద్ధాంతి పండిత బుట్టే వీరభద్ర దైవాజ్ఞ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. క్రేన్ సాయంతో ధ్వజస్తంభ ప్రతిష్ట, అమ్మవారి ప్రాణప్రతిష్ట చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకుని పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఆలయ ఆవరణలో అన్నదానం ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు బందోబస్తు నిర్వహించారు.


చిన్నపెండేకల్‌లో పూజలందుకున్న పెద్దమ్మవ్వ

యార్డుకు పెరిగిన ఎండుమిర్చి


రైతులు తెచ్చిన ఎండుమిర్చి బస్తాలు

ఆదోనిఅర్బన్: ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో రోజురోజుకు ఎండుమిర్చి దిగుబడులు పెరుగుతున్నాయి. వారంలో రెండు రోజులు బుధవారం, ఆదివారం జరుపుతున్న ఎండుమిర్చి యార్డులో ఆదివారం 2,231 సంచుల ఎండుమిర్చిని రైతులు తీసుకొచ్చారు. ఇందుకు గరిష్టంగా రూ.24,800, మధ్య రూ.15,009, కనిష్ట రూ.6,010గా నమోదైంది. అదేవిధంగా బ్యాడిగి రకం గరిష్టం రూ.24,800, కడ్డీ బ్యాడిగి రూ.18,069, డీలక్స్ రూ.14,600, లాలీ రకం రూ.13,599, తేజ రకం రూ.18 వేలు, సింజంట రకం రూ.12,459, డీడీ రకం రూ.13,539, శివరంజని రకం రూ.12 వేలు, సూపర్-10 రకం రూ.13,999, 5531 రకం రూ.15,009, 1081 రకం రూ.15,300, తాలు రకం రూ.8311, 2043 రకం రూ.18,069, హనుమాన్ రకం గరిష్ట ధర రూ.13,222గా నమోదయ్యాయి. ఇక నుంచి ప్రతి ఆదివారం జరగాల్సిన మిర్చి మార్కెట్ శనివారం, బుధవారం నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నామని అధికారులు తెలిపారు.

విధి వక్రీకరించినా ప్రభుత్వం ఆదుకుంది


వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మిఠాయిలు పంచుతున్న ఫర్జానా



వెల్దుర్తి(కృష్ణగిరి): వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు కుటుంబాన్ని నిలబెట్టాయి.. వెల్దుర్తిలోని ముస్లిం మహిళ ఫర్జానా తనకు ప్రభుత్వం అందిస్తున్న సహకారానికి సంతృప్తి వ్యక్తం చేస్తూ కుమార్తెతో కలిసి ఆదివారం వైఎస్సార్‌సీపీ కార్యాలయానికి చేరుకుని మిఠాయిలు పంచింది. జగనన్న పాలనలో ఫర్జానాకు జరిగిన మేలును ఆమె మాటల్లోనే.. 'తనకు పట్టణానికే చెందిన మజీద్‌తో పెళ్లి కాగా కుమార్తె, కుమారుడు ఉన్నారు. టైలర్‌గా ఉన్న నాకు ఏడాదికి రూ.10 వేలు చొప్పున సాయం అందింది. కుమార్తె స్థానిక ప్రాథమిక పాఠశాలలో చదువుకుంటుండగా పుస్తకాల నుంచి బ్యాగు, డ్రస్సులన్నీ ప్రభుత్వమే ఉచితంగా అందించగా, అమ్మ ఒడి సాయం ఏటా అందింది. సొంతిల్లు లేని తమకు జగనన్న కాలనీలో ఇంటి పట్టా అందింది. గృహం మంజూరైంది. పొదుపు సంఘం ద్వారా లబ్ధి పొందాను. సంతోషంగా ఉన్న సమయంలో విధి కన్నెర్ర చేయడంతో భర్త అనారోగ్యంతో మరణించాడు. ఒక్కసారిగా భవిష్యత్తు అంధకారమై కుంగిపోగా వైఎస్సార్ బీమా తక్షణ సాయం రూ.10 వేలు అందింది. తర్వాత బీమా నగదు బ్యాంకులో రూ.90వేలు రూ.లక్ష జమయ్యాయి. నెలలోపే పింఛన్ మంజూరై ప్రతినెలా రూ.3 వేలు అందుతోంది. ఇటీవల ఇంటి స్థలం రిజిస్ట్రేషన్ చేశారు. దీంతో భవిష్యత్తుకు అండగా ఆర్థిక బలం చేకూరింది. కుట్టు మిషన్ ఆదాయంతో జీవనం గడుపుతున్న తన, పిల్లల భవిష్యత్తుపై ఆశ చిగురించింది. సీఎం జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే తనకు ఆపదలో అండగా నిలిచాయని ఫర్జానా పేర్కొంది.